క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో గండి రవి కుమార్ తదితరులు

సబ్బవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో పెందుర్తి నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు సబ్బవరం మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మొగలిపురం గ్రామం ఉప సర్పంచ్ సిరపురపు వాసు,గురి శ్రీనివాస్, కరక రాము, కర్రి వినోద్, గురి రవి కుమార్ కలిసిన వారిలో ఉన్నారు. పార్టీ శ్రేణులంతా ఉత్సాహంగా పనిచేయాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ వెన్నుతట్టి ప్రోత్సహించారని వారు చెప్పారు.

అప్పన్న సన్నిధిలో చీరాల ఎమ్మెల్యే



అప్పన్న ఆలయంలో ఎమ్మెల్యే మాలకొండయ్య తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం చీరాల ఎమ్మెల్యే ఎం. మాలకొండయ్య దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి అందజేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

పరవాడ: ప్రభుత్వం సరఫరా చేసే నోట్ పుస్తకాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నారాయణరావు కోరారు. కళాశాలలో చదువుతున్న 316 మంది విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన నోట్ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. త్వరలో విద్యార్థులకు బ్యాగు, పాఠ్య పుస్తకాలను అందజేయనున్నామని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు.

విద్యార్థులకు కిట్ల అందజేత



స్టూడెంట్ కిట్‌లు అందిస్తున్న రెడ్డి నారాయణరావు

పెందుర్తి: రాంపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్‌లను జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు అందించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముందుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, హెచ్‌ఎంలు కె.ప్రసాద్, దొగ్గ సూర్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ గౌరీష్, నాయకులు కుచ్చు కన్నయ్య, అన్నంరెడ్డి బంగారునాయుడు, సారధి, అన్నంరెడ్డి శ్రీను, దొడ్డి శ్రీధర్, గండి భూషణరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు

సింహాచలం: నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో అడవివరంలో ఆదివారం మహా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందని తెలిపారు. రోటరీబ్లడ్ సెంటర్, వందే భారత్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో యువకులు పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

విశాఖ నగరాభివృద్ధే ధ్యేయం

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కమారి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సింహాచలం: విశాఖ నగరాభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డులో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుతో కలిసి మేయర్ శుక్రవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ హరివెంకటకుమారి మాట్లా డుతూ జీవీఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ పెందుర్తి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రతీ వార్డును మోడల్ వార్డుగా తీర్చి దిద్దుతానని తెలిపారు. జీవీఎంసీ నిధులతో పాటు ఎమ్మెల్యే నిధులు కూడా వెచ్చిస్తానని చెప్పారు. బాలాజీగార్డెన్స్‌లో మూడు చోట్ల రూ.28.83లక్షలతో అభివృద్ధి చేసిన పార్కులను ప్రారంభించారు. కార్యక్రమంలో 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, జోనల్ కమిషనర్ హేమావతి, 93వవార్డు టీడీపీ అధ్యక్షుడు గంగ వరహాలు, కర్రి నూకరాజు, కర్రి వెంకట్, భాను, గిరి, సీతాలు, బలిరెడ్డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు చేసిన పనుల వివరాలు

- నాయుడుతోట నుంచి దుర్గానగర్ గెడ్డపై రూ.19 లక్షలతో కల్వర్టు నిర్మాణం
- విరాట్‌నగర్‌లో గెడ్డకు రూ.19.90 లక్షలతో ఎస్ డబ్ల్యూ డ్రైన్ , ప్రహ్లాదపురం శ్మశానవాటిక వద్ద దుర్గానగర్‌లో రూ.15.70 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణం
- ప్రహ్లాదపురంలో రూ.16.45 లక్షలతో ఎంపీపీ స్కూల్ నుంచి శ్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు - గొల్లనారాయణపురంలో రూ.19.85లక్షలతో పోలిపిల్లి అమ్మవారి ఆలయం నుంచి కమ్యూనిటీ హాలు వరకు సీసీ రోడ్డు, సీసీ కాలువ
- భరత్‌నగర్‌లో రూ.18లక్షలతో శిథిలావస్థలో ఉన్న ప్రధాన కాలువ స్థానంలో కొత్తకాలువ నిర్మాణం.
- శ్రీనివాసనగర్‌లో రూ. 16.62లక్షలతో గెడ్డకు ఎస్ డబ్ల్యూ డ్రైన్
- రూ.19.90 లక్షలతో ఈస్టుపాయింట్ కాలనీ నుంచి గోశాల వెళ్లే కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

గోశాలలో ఘనంగా వన మహోత్సవం



వనమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి



మొక్కలు నాటుతున్న దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శుక్రవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సంపెంగ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం దేవస్థానం అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేవస్థానం గోశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రాజేంద్రకుమార్, నరసింహరాజు, ఏఈ హరిరాజు, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, గాయత్రి పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అయ్యప్పకు అభిషేకాలు

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆయలంలో ఉత్తర నక్షత్రం సందర్భంగా శుక్రవారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణపై ఫిర్యాదు



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందజేస్తున్న మామిడి కొండాజీ,సేనాపతి దుర్గారావు



రాకపోకలకు అవకాశం లేకుండా తవ్వేసి ధ్వంసం చేసిన రహదారి

సబ్బవరం: మండలంలోని నారపాడు పంచాయతీ పరిధి బలిజపాలెంలో గెడ్డపోరంబోకు స్థలం ఆక్రమణపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. బలిజపాలెంలోని సర్వే నెంబర్ 161,162లో సుమారు 7 ఎకరాల ప్రభుత్వ గెడ్డ పోరంబోకు ఉంది.ఈ గెడ్డను ఆనుకొని వెనుకన ఉన్న తాసుబిల్లివారి కళ్లాలకు నడక దారి ఉంది.గతంలో గెడ్డవాగు వెంట ఉండే రహదారి విషయంలో తాసుబిల్లివారి పాకల రైతులకు,గెడ్డవాగు ఆక్రమించుకొని ఉంటున్న అదేగ్రామానికి చెందిన మామిడి అప్పారావు కుటుంబ సభ్యుల మధ్య వివాదం తలెత్తడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన రెవెన్యూ సిబ్బంది సమగ్ర సర్వే చేసి గెడ్డవాగు ఆక్రమణలను గుర్తించి హద్దులు నిర్ణయించారు. అప్పటి నుంచి గెడ్డను ఆనుకొని ఉన్న రహదారి గుండా తాసుబిల్లివారి కళ్లాలకు ఆయా రైతులు రాకపోకలు సాగిస్తున్నారు.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరలా పాత వివాదం తెరపైకి వచ్చింది. ఆక్రమణలో ఉన్న మామిడి అప్పారావు కుటుంబ సభ్యులు జనసేన పార్టీ సానుభూతి పరులు కావడంతో గెడ్డను ఆనుకొని ఉన్న రహదారిని శుక్రవారం తవ్వేసి గెడ్డవాగు ఆక్రమణకు పాల్పడ్డారు.దీంతో గ్రామపెద్దలు మామిడి కొండాజీ,సేనాపతి దుర్గారావుతో పాటు కళ్లాలకు వెళ్లే రైతులు నిలదీయడంతో గెడ్డవాగులో ఉన్న మొత్తం ఆక్రమణలు తొలగించాలని జనపార్టీ సానుభూతిపరులు వివాదానికి దిగారు.దీంతో మామిడి కొండాజీ,సేనాపతి దుర్గారావు ఆర్ఐ వీరయ్యకు ఫిర్యాదు చేశారు.

దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మానసిక దివ్యాంగులు

దాబాగార్డెన్స్ : సంఘ సేవకుడు రవిశంకర్‌రెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కొత్తవలస సమీపంలో గల చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న 65 మంది మానసిక వికలాంగులకు రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు రెడ్డి రమాదేవి, చిహిర్, మయూఖ్, బాదిరెడ్డి పైడితల్లమ్మ, కచ్చాల రమణమ్మ, రాము, బాదిరెడ్డి కృష్ణ(గోపి), వెంకట నాగలక్ష్మి, బాదిరెడ్డి జగన్నాథరావు, పద్మ, ఎస్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకు ప్రజలకు నిత్యావసరాలు



బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: రైతు బజార్ల ద్వారా తక్కువ ధరలకే ప్రజలకు నిత్యవసరాలను ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్‌లో సబ్సిడీ ద్వారా అందిస్తున్న బియ్యం, కందిపప్పు స్టాల్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తూనికలు, నాణ్యతలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సరకులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, బీజేపీ నియోజవకర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, రైతు బజార్ ఈవో షర్మిల తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి వెంకయ్యనాయుడు

అక్కిరెడ్డిపాలెం: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం ఉదయం 6 గంటలకు విచ్చేయనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని దివ్యక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. వెంకయ్యనాయుడుకు ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు గంద్రేడి నూకరాజు (ఫైల్)

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీకొనడంతో డ్రైవర్ గంద్రేడి నూరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంద్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

దాబాగార్డెన్స్ : హెల్మెట్‌ధారణ.. హెల్మెట్ ఆవశ్యకతపై శుక్రవారం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా న్యాయ సేవా అథారిటీ నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్‌ఎస్ఏ) కార్యదర్శి శేషమ్మ హెల్మెట్ వాడకం ఆవశ్యకత గురించి తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వారి డ్రైవింగ్ లైసెన్స్ 3 నెలల పాటు రద్దు చేయబడుతుందని తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అన్ని ఆర్టీసీ డిపోల్లో నిర్వహిస్తామని తెలిపారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

వివాహిత అదృశ్యం



భవాని

అల్లిపురం: తన భార్య కనిపించడం లేదని అల్లిపురం, గాం. దీబొమ్మ జంక్షన్‌కు చెందిన ఎస్.సురేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. గత ఏడాది డిసెంబర్ 24న సురేష్ పనికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా అతని భార్య ఎస్.భవాని కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంది. అప్పటి నుంచి నగరం, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 92941 06386, 9440 904716కు తెలియజేయాలని సీఐ కోరారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరం పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా

అమృతపురం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన బృందం



అమృతపురం వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం వెల్‌నెస్ సెంటర్‌ను టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు శుక్రవారం సందర్శించారు. సెంటర్ పరిధిలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. మాతా శిశు ఆరోగ్య సేవలు,గర్భిణులు,బాలింతలు,పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి లూసీ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ కుమారి,వైవీ తులసీ, ఏఎన్ఎం పరమేశ్వరీతో పాటు ఆశ వర్కర్లకు చెందిన రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు, వారి గృహ స్థాయిలో నియమానుసారం చేస్తున్న సందర్శనల రికార్డులు పరిశీలించారు. ప్రపంచ జనాభా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. రికార్డుల నిర్వహణ,డేటా ఆన్‌లైన్ చేయడంలో లోపాలను గుర్తించి తగు సూచనలు చేశారు. జిల్లా అధికారులు,ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని డాక్టర్ లూసీ తెలిపారు.జిల్లా టాస్క్ ఫోర్స్ బృందంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు,ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి కె. జగదీష్, నానాజీ,మిగిలిన అధికారులు డి నాగమణి, వై. జనార్దన్,గుల్లేపల్లి ఆరోగ్య విస్తరణ అధికారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనుడిపై చర్యలు తీసుకోవాలి



తాడి కొండపై నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు జరిపిన ప్రదేశం

పరవాడ: తాడి క్వారీలో నిబంధనలు అతిక్రమించి గ్రావెల్ తవ్వకాలకు పాల్పడిన అక్రమార్కులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ శీలం నదియా డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం సాక్షితో మాట్లాడారు. తాడి గ్రామంలో సర్వే నంబరు 116లో క్వారీలో గ్రావెల్ తవ్వకాలకు లీజు పొందిన వ్యక్తి ప్రభుత్వం నిర్దేశించిన హద్దులు దాటి ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి రూ.కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డాడని ఆరోపించారు. రాత్రివేళ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతూ రూ.కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నాడని నదియా దుయ్యబట్టారు. తనకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయని.. తనను ఎవరు ఏమీ చేయలేరని గ్రామస్తులపై బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. అధికార పార్టీని అడ్డంపెట్టుకొని అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ నదియా డిమాండ్ చేశారు.

వలంటీర్లకు గౌరవ వేతనాల చెల్లింపునకు అంగీకారం



వలంటీర్లతో ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని గ్రామ సచివాలయ వలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లింపు అంశం శుక్రవారం కొలిక్కి వచ్చింది. ఎంపీపీ బోకం సూర్యకుమారి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల్లో గౌరవ వేతనం చెల్లించినా సబ్బవరం మండలంలో పెండింగ్‌లో పెట్టారు. తాజా చర్చలతో రెండు నెలల గౌరవ వేతనం చెల్లించేందుకు పంచాయతీ కార్యదర్శులు అంగీకరించారు. దీంతో మండలంలోని సుమారు 330 మంది వలంటీర్లకు రెండు నెలల గౌరవ వేతనం అందనుంది. చర్చలు సఫలీకృతం చేసినందుకు ఎంపీపీ బోకం సూర్యకుమారితో పాటు గౌరవ వేతనం చెల్లించేందుకు ముందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు వలంటీర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం నాయకులు బోకం రామునాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమా మహేశ్వరరావు,సబ్బవరపు నారాయణమూర్తి,బోను గంగునాయుడు తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ర్యాలీలో పాల్గొన్న శ్రామిక్ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు హాజరై.. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా నాయకత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పట్నాయక్ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పోరాటాల ఫలితంగా పాత పెన్షన్ విధానాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐఆర్ఎఫ్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే 1972లో చేసిన విధంగా సమ్మె చేసేందుకు సిద్ధమన్నారు. ర్యాలీ అనంతరం ప్రధాని మోదీకి రాసిన వినతిపత్రాన్ని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు అందజేసి.. ప్రధానికి పంపాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు పి.వి.జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.